క్లుప్తంగా

జగనన్న పాలవెల్లువపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు, యర్రగుంట్లపాడు గ్రామాల్లో మంగళవారం పాడిరైతులకు జగనన్న పాలవెల్లువలో భాగంగా పశువుల కొనుగోలుకు సంబంధించి రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధకశాక జాయింట్ డైరెక్టర్ జేపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువలో రిజిస్టర్ అయిన పాడిరైతులకు పశువుల కొనుగోలుకు సంబంధించి బ్యాంకు రుణాలు అందజేస్తామని చెప్పారు. పశువులు కొనుగోలు చేయాలని భావించే రైతులు పశుసంవర్ధకశాఖ, మరియు డీఆర్‌డీఏ వారిని సంప్రదించాలని కోరారు. అమూల్ కేంద్రాల్లో పాలుపోసే రైతులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఒక గేదె ఉన్నాగానీ మరో గేదె కొనుగోలుకు సంబంధించి కో–ఆపరేటివ్ బ్యాంకు ద్వారా రూ.లక్ష రుణసదుపాయం కలిప్తారని చెప్పారు. పశువు పెంపకం దాణ కోసం మరో రూ.30 వేలు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పాడి రైతులు వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. గుంటూరు డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, తాడికొండ అసిస్టెంట్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు, జీడీసీసీ బ్యాంకు మేనేజర్ పవన్, పశువైద్యాధికారి పీర్ అహ్మద్, ఏపీఎం సుజాత, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ఏఐటీయూసీ కార్యాలయం వద్ద మంగళవారం సంఘం 104వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకుడు మునగాల రామారావు ముఖ్య అతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920లో ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. సంఘం దేశంలోనే పురాతన కార్మిక సంఘం సమాఖ్య అని తెలిపారు. 1920 అక్టోబర్ 31న బొంబాయిలో లాలా లజపతిరాయ్, జోసెఫ్ బాప్టిస్టా, ఎన్.ఎం.జోషి, దివాన్ చమన్‌లాల్ మరికొంతమంది ప్రముఖులు ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపించడంలో ముఖ్య పాత్ర వహించారని తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, షేక్ ఖాసిం, శీలం శ్యామ్, నడకుదురు లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్‌యూ రోడ్‌లోని లైన్ల మార్పిడి నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తాడేపల్లి రూరల్ ప్రాంతంలోని కొలనుకొండ, గుడిమెడ గ్రా మాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళా అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



తెనాలి: పట్టణంలోని జేఎంజే మహిళా కళాశాల గృహ విజ్ఞాన శాస్త్ర అధ్యాపకురాలు పాటిబండ్ల హేమలతకు సమాజ శాస్త్ర విభాగంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. కుటుంబాలు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందుతున్న సామాజిక సహకారం–మానసిక సంక్షేమం గుంటూరు జిల్లాలో ఒక అధ్యయనం' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. యూనివర్సిటీ సోషియాలజీ విభాగం అధిపతి ఆచార్య వి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చేసిన పరిశోధనతో సమర్పించిన థీసిస్‌కు పీహెచ్‌డీ లభించింది.

ప్రజా ధనాన్ని వృథా చేయవద్దు

నగరంపాలెం: ప్రజా ధనాన్ని వృథా చేయవద్దని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవీవీ కుమార్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు ఆదేశాల మేరకు జీఎంసీ పరిధిలోని 57వ నంబర్ సచివాలయంలో మంగళవారం జీఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సచివాలయ కార్యదర్శులతో 'అవినీతికి నో చెప్పండి.. దేశానికి అంకితం కండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన కేవీవీ కుమార్ మాట్లాడుతూ పౌర సేవలను ప్రజల అందరికి నాణ్యత ప్రమాణాలతో అందించాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా పంపిణీ పథకాలను సక్రమంగా అందజేయాలని అన్నారు. విజిలెన్స్ విధి విధానాలు, అవగాహన వారోత్సవాల నిర్వహణపై ఆయన వివరించారు. సదస్సులో వివిధ విభాగాల ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమం.. ఓ విప్లవం

- ఏపీ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి
- మండడంలో సచివాలయాల సందర్శన
- సచివాలయాల్లో 540 రకాల సేవలు అందిస్తున్న వైనంపై ఆరా, రికార్డులు తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న పీఆర్ అండ్ ఆర్‌డీ ఏపీ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జున రెడ్డి

మండడం(తాడికొండ): తుళ్ళూరు మండలం మండడం గ్రామ సచివాలయాలను మంగళవారం ఏపీ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న వైనంపై ఆరా తీసి ఎంతమంది లబ్ధి చేకూరుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో అన్నిరకాల సేవలను తీసుకొచ్చారన్నారు. సచివాలయాల ద్వారా 540 రకాల సేవలను అందిస్తున్న ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారుల ఇంటివద్దకే చేర్చుతుండటంపై రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా, దరఖాస్తు పెట్టకుండా, లంచాలు లేకుండా నేరుగా సంక్షేమం వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రతినెల ఒకటో తారీఖున పింఛన్లు వలంటీర్లు ఇంటివద్దకే అందించడంపై వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, లబ్ధిదారులు సంతృప్తిగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో సచివాలయాల్లోని భూ రిజిస్ట్రేషన్లు, బస్సు, రైలు, ఫ్లైట్ టికెట్లు కూడా అందుతాయన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, 2024లో 175 కి 175 సీట్లలో వైఎస్సార్ సీపీని గెలిపించి ప్రభంజనమైన విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ శివన్నారాయణ, సింగిల్ విండో అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు, కార్యదర్శి సుభాని పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగాలున్నాయని బెయిల్ తెచ్చుకుని ఇంత రాద్ధాంతమా?

- అన్ని కేసుల్లో స్టేలు ఎత్తేసుకొని బాబు విచారణ కోరితే నిజమే గెలుస్తుంది
- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



తాడికొండ: తనకు రోగాలున్నాయని మధ్యంతర బెయిల్ తెచ్చుకొని ఆసుపత్రిలో చేరుతున్న బాబు కోసం టీడీపీ నాయకులు, ఓ సామాజికవర్గ వాదులు ఇంత రాద్ధాంతం చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో టీడీపీ నాయకుల చేష్టలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకొని చూసి ఫక్కున నవ్వుకునే పరిస్థితి వచ్చిందని, నిన్నమొన్నటి వరకు బాబు తప్పు చేయలేదంటూ స్క్వాష్ పిటీషన్ వేసి బీరాలు పలికిన నేతలు ఇప్పుడు కంటి ఆపరేషన్ కోసం ఆసుపత్రికి వెళుతుంటే న్యాయం గెలిచిందనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. తప్పులను కప్పి పుచ్చుకోవడం, ఒప్పుగా మలచుకునేందుకు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని, ప్రజల్లో గోబెల్స్ ప్రచారం చేయడం తొలినుంచి వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. బాబు బయటకు వెళితే సాక్ష్యాలను తారుమారు చేస్తారని ఆయనకు బెయిల్ మంజూరు చేయలేదని, కానీ అనారోగ్య సమస్యలను అడ్డుపెట్టుకొని బయటకు వచ్చిన ఆయన వ్యవస్థలను మేనేజ్ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిబంధనలు పాటిస్తూ 4 వారాల్లో బాబు జైలులో మళ్లీ సరెండర్ కావాల్సి ఉంటుందని, అప్పుడు మళ్లీ న్యాయం, గెలిచింది అని టీడీపీ నాయకులు సంబరాలు చేసుకుంటారేమో చెప్పాలని ప్రశ్నించారు.

ప్రజాధనం దిగమింగితే సంబరాలా..?

రూ.లక్షల కోట్లు ప్రభుత్వ ధనం దిగమింగిన కేసుల్లో బాబును న్యాయస్థానాలు జైలులో పెడితే టీడీపీ నేతలు రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం, అత్యుత్సాహంతో నోటికొచ్చిన వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. నిబంధనలతో ఇచ్చిన బెయిల్ అని తెలిసినా ఊరేగింపులు, సంబరాలు నిర్వహిస్తుండటం రాష్ట్రంలో లేనిది ఉన్నట్లు ప్రజలను ప్రభావితం చేసేందుకే అనే అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయంగా బాబు చేసే తప్పుడు పనుల దెబ్బకు తెలంగాణలో జెండా పీకేసే పరిస్థితి వచ్చిందని, కనీసం పోటీకి కూడా అభ్యర్థులను నిలబెట్టే పరిస్థితి లేని చంద్రబాబు, అక్కడ పార్టీని తాకట్టు పెట్టి ఓ మూలన కూర్చోవడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలకు అర్థమైందన్నారు. ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న బాబు నాడు రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి 10 సంవత్సరాల ఉమ్మడి హక్కులను వదిలి పారిపోయి వచ్చాడని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తే ఎక్కడ ఓటుకు నోటు కేసులో జైలులో వేస్తారో అని పార్టీని మూటగట్టి పక్కన బెట్టారని ఆ పార్టీ నాయకులే అనడం బాబు దుర్మార్గ మనస్తత్వానికి నిదర్శనమన్నారు. జాతీయ పార్టీ అని చెప్పుకుంటూ తెలంగాణలో పోటీని ఉప సంహరించుకున్న బాబు పార్టీకి ఆ హోదాను రద్దుచేసి ప్రాంతీయ పార్టీగానే గుర్తించాలన్నారు. ఏపీలో కూడా బాబుకు అభ్యర్థులు కరువై పార్టీని మూసేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, బాబును నమ్మి నట్టేట మునగకుండా ఇకనైనా టీడీపీ శ్రేణులు కళ్లు తెరిస్తే మంచిదని, ఆయన వెంట నడిస్తే వారి రాజకీయ భవిష్యత్తు నాశనం కావడం ఖాయమన్నారు.

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్



జెండా ఊపి రన్ ఫర్ యూనిటీని ప్రారంభిస్తున్న కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి



దుగ్గిరాలలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యువమోర్చా నాయకులు

- పటేల్ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి

మంగళగిరి: భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నేషనల్ యూనిటీ డే వేడుకలను పురస్కరించుకుని రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో జెండా ఊపి రన్‌ను కమాండెంట్ సుబ్బారెడ్డి ప్రారంభించారు. తొలుత సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ మహాత్ముల ఆశయాల వల్ల నేడు మనం స్వేచ్ఛగా, ఐక్యంగా జీవిస్తున్నామన్నారు. భారతదేశంలోని అన్ని ప్రాంతాలు భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదాన్ని చాటుతూ, స్వాతంత్ర్యం వచ్చేనాటికి రాజరికపాలనలో ఉన్న 565 సంస్థానాలను విలీనం చేసి భారతదేశ సమైక్యతకు పాటుపడిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయి పటేల్ అని కొనియాడారు. దేశప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించి, ఎనలేని సేవలను అందించి చరిత్రపుటల్లో అగ్రస్థానంలో నిలిచారని గుర్తు చేశారు. దేశానికి పటేల్ అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని దేశఐక్యత, సౌభ్రాతృత్వం, అంతర్గత భద్రతకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ఈ సందర్భంగా రన్‌ఫర్ యూనిటీ, రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీ కృష్ణ, దేవానంద్, మల్లికార్జున్‌లతో పాటు పలువురు బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాసవి కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మైలా హరికృష్ణ పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువమోర్చా పూర్వ జిల్లా కార్యదర్శి జూపల్లి వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి దానబోయిన శివాజీ యాదవ్, మోహన్‌రావు, గుంటూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువులు పరిశుభ్రంగా ఉంచాలి



మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలో ఉన్న మంచినీటి చెరువును పరిశుభ్రంగా ఉంచాలని మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య అన్నారు. గ్రామంలో ఉన్న చెరువు కట్ట మొత్తం పిచ్చిమొక్కలు, కంపలతో నిండిపోయి ఉంది. మంగళవారం యుద్ధప్రాతిపదికన చెరువును శుభ్రం చేయించారు. వర్షాభావ పరిస్థితుల్లో అవసరమైన నీటిని వాడుకునేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మంచినీటిని శుద్ధి చేసి నీరు ప్రజలకు అందించేందుకు మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసే దిశగా చెరువును శుభ్రం చేయడం జరిగిందన్నారు. సర్పంచ్ సాంబ్రాజ్యం కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ



తెనాలి: వివిధ ప్రదేశాల్లో జరిగిన అథ్లెటిక్స్‌లో స్థానిక నాజరు పేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ప్రతిభ చాటారు. నెల్లూరులోని అధాని వరల్డ్ స్కూలో సీబీఎస్ఈ విధానంలో నడుస్తున్న 120 పాఠశాలలు పాల్గొన్న అథ్లెటిక్స్‌లో సెయింట్ జాన్స్ 11వ తరగతి విద్యార్థి ఎస్.మంజునాథ రాఘవేంద్ర జావలిన్ త్రోలో కాంస్య పతకాన్ని సాధించి, లాంగ్ జంప్‌లో నాలుగో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎస్ఎస్ఎం స్కూల్ విజయవాడలో జరిగిన అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్‌లో 11వ తరగతి విద్యార్థిని కె.మనీష నాలుగో స్థానంలో నిలిచిందని డైరెక్టర్ కె.యానీ అరుణలత చెప్పారు. చెన్నైలోని చంగల్‌పేట గోకులం స్కూల్‌లో జరిగిన క్రీడా పోటీల్లో హ్యాండ్‌బాల్, తునిలో జరిగిన ఖోఖోలో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించినట్లు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జె.సూరజ్ మోహన్, ప్రిన్సిపల్ వినీల, పీఈటీలు విద్యార్థులను అభినందించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

కొల్లిపర: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఎంఈఓ సాల్మన్‌రాజు అన్నారు. తుములూరు, చివలూరు, కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు చేస్తున్న బోధనను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల చదువుపై శ్రద్ధ తీసుకునే విధంగా వారి తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత



కట్టడాన్ని పొక్లెయిన్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో ఓ మహిళ ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని వివిధ శాఖలకు చెందిన అధికారులపై దౌర్జన్యం చేస్తూ వారిపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కార్పొరేషన్ అధికారులు స్పందించి మంగళవారం ఆ అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రకాష్ నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్ దగ్గరలో ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిలో అక్కడే నివాసముండే ఓ మహిళ రాత్రికి రాత్రి తాటాకులతో ఓ పాక వేసి చుట్టూ సిమెంటు గోడలు నిర్మించింది. అనంతరం తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ కావాలంటూ నులకపేట విద్యుత్‌శాఖ అధికారులను కలిసింది. అధికారులు సంబంధిత స్థలం పత్రాలు అడగడంతో నాకు ఇల్లు ఉంది. మీరు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వరు అంటూ గొడవపడింది. విద్యుత్ అధికారులు కనీసం ఇంటి పత్రాలు ఇవ్వాలని కోరడంతో ఆమె వారిని నోటికొచ్చినట్లు దూషించింది. తాడేపల్లి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో వేసిన కట్టడాన్ని తొలగించాలని సూచించడంతో వారిని తిట్టి వారిపైనే తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు చేసింది. రెవెన్యూ అధికారులు తన ఇంటికి వచ్చి దాడిచేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదు చేయగా స్పందించిన తాడేపల్లి తహసీల్దార్ మల్రెడ్డి నాగిరెడ్డి ఆమె ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని తమపై దుర్భాషలాడుతోందని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకోవడం నేరమని, అందుకే ఆమె ఇల్లు తొలగించామని ఆయన తెలియజేశారు.

రక్తహీనతపై అవగాహన కలిగించాలి

డీఎల్‌డీఓ సుజాత



తాళ్లూరులో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ సుజాత

ఫిరంగిపురం: విద్యార్థుల్లో తరచుగా ఉండే రక్తహీనతపై వారి తల్లిదండ్రులకు అవగాహన అవసరమని డీఎల్‌డీఓ సుజాత అన్నారు. మండలంలోని 113తాళ్లూరు, యర్రగుంట్లపాడు గ్రామాల్లోని సచివాలయాలు, హెల్త్‌సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం డీఎల్‌డీఓ సుజాత పరిశీలించారు. విద్యార్థులకు సరైన సమయంలో ఐరన్ మాత్రలు వేస్తున్న విషయాలపై ఆరోగ్య సిబ్బందిని ప్రశ్నించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేసినా, కొందరికి రక్తహీనత ఉండటంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేసిన వివరాలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆర్‌సీహెచ్ మోర్టల్ మ్యాపింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలించి గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారా లేదా అని వివరాలు సేకరించారు. అనంతరం యర్రగుంట్లపాడు సచివాలయాన్ని పరిశీలించారు. సిబ్బంది మూమెంట్ రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేయకపోవడంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. విధులకు హాజరై ఆయా పనులపై వెళ్లే సిబ్బంది తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదుచేయాలని చెప్పారు. అనంతరం ఆర్‌బీకేను పరిశీలించారు.

ప్రజా రక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు

తాడేపల్లిరూరల్: ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజారక్షణ భేరి బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మంగళవారం కోరారు. దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడిలో కరపత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులు లేకుండా చేస్తోందని, దేశంలో మత కలహాలు సృష్టిస్తూ దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తోందని అన్నారు. ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర రాయలసీమ నుంచి బయలుదేరి నవంబర్ 9న మంగళగిరి వస్తున్న సందర్భంగా ఆయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దుగ్గిరాల మండలంలో రేవేంద్రపాడు గ్రామంలో మద్రాస్ కాలువపై వున్నబ్రిడ్జి శిథిలావస్థలకు చేరి ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని, వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. నవంబర్ 15వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, అద్దంకి పాములు, యార్లగడ్డ కొండలు పాల్గొన్నారు.

చిన్న సినిమాల విడుదలకు పరిష్కారం



మాట్లాడుతున్న దిలీప్‌రాజా పక్కన మధుమోహన్‌కృష్ణ, మోహన్‌గౌడ్

తెనాలి: విడుదలకు నోచుకోని చిన్న సినిమాల ప్రదర్శనకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో జరుపుతున్న చర్చలు సానుకూలంగా ఉన్నందున త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని మా–ఏపీ, ఆంధ్రప్రదేశ్ ఫిలిం చాంబర్ బాధ్యులు వ్యక్తం చేశారు. ఫిలిం చాంబర్‌తో కలిసి మా–ఏపీ ఇందు కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో మంగళవారం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా–ఏపీ) ఆంధ్రప్రదేశ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ చిన్న సినిమాల విడుదలకు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు అంబటి మధుమోహన్‌కృష్ణ నేతృత్వంలో అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్టు తెలిపారు. విడుదలకు నోచని సినిమాలపై కమిటీని సంప్రదించాలని, అయితే సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మధుమోహన్‌కృష్ణ మాట్లాడుతూ ఆంధ్రలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సబ్సిడీ పెంపుదలను పరిశీలించాలని, చలనచిత్ర అభివృద్ధి సంస్థను కోరారు. ఫిలిం చాంబర్ కార్యదర్శి మోహన్‌గౌడ్ మాట్లాడుతూ థియేటర్లలో 5వ ఆటకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించటం శుభపరిణామంగా చెప్పారు. ఇప్పటికే అన్ని లోకేషన్లను ఉచితంగా ఇస్తూ ప్రభుత్వం జీవో జారీచేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమకు మౌలిక సదుపాయాల కల్పనపై చర్చలకు ఆంధ్ర ప్రదేశ్‌లో నివసిస్తున్న సినిమా యూనియన్ పెద్దలను ఆహ్వానించాలని సూచించారు. మా–ఏపీ సంయుక్త కార్యదర్శి మిలటరీ ప్రసాద్ మాట్లాడుతూ, వీడియో కెమెరాలతో కనీసం తగినంత లైటింగ్ లేకుండా చిత్రీకరించి సెన్సారు కోసం రావటం సమంజసం కాదన్నారు. నిర్మాత చదలవాడ హరిబాబు, దర్శకుడు అఫ్జల్, కెమెరామెన్ వంశీ, నటులు అమీర్‌ఛౌదరి, బెల్లంకొండ వెంకట్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన కఠెవరం విద్యార్థులు

తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో తెనాలి మండలం కఠెవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పి.సంజయ్ వర్మ, పి.హరినారాయణ రాజు, ఎం.హనుమాన్ బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్ తెలిపారు. పోటీలను కాకినాడ సమీపంలోని జగన్నాథ పురంలో ఇటీవల నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందించి, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, కోచ్ కె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జపమాల ప్రార్థనలు



మరియ తల్లి విగ్రహాన్ని ఊరేగిస్తున్న సంఘస్తులు

తెనాలి టౌన్: అంగలకుదురులోని ఆర్సీఎం చర్చిలో అక్టోబరు జపమాల ప్రార్థనలు మంగళవారంతో ముగిశాయి. ఫాదర్ జ్యోతి రాజ్ దివ్యబలి పూజలు జరిపారు. బైబిల్ గ్రంథం నుంచి వాక్యోపదేశం చేశారు. మరియ తల్లి బాటలో నడవాలని సూచించారు. మరియ తల్లి విగ్రహాన్ని గ్రామంలో సంఘస్తులు అధ్వర్యంలో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో అంగలకుదురు విచారణ గురు ఫాదర్ శౌరిరాజు, ఫాదర్ ఇమ్మానియేలు, ఫాదర్ చరణ్, సిస్టర్సు ఉపదేశం బాల స్వామి, సామియేలు, రాజమోహన్, బాలస్వామి, జ్ఞాన మేరీ, సంఘపెదలు , విశ్వాసులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థిక స్వావలంబన



పంపిణీ చేసిన కుట్టుమిషన్లతో లబ్ధిదారులు, క్లబ్ బాధ్యులు

తెనాలి: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని రోటరీ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ వడ్లమాని రాజ్యలక్ష్మి అన్నారు. మహిళ ఆర్థికంగా ఎదిగితే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో మంగళవారం క్లబ్ కార్యాలయంలో 10 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సభకు క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు అధ్యక్షత వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు మిషన్లు దోహదపడగలవని రాజ్యలక్ష్మి చెప్పారు. అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ ద్వారా నిధులు సేకరించి, తెనాలి ప్రాంతంలో మరింత సామాజిక సేవ చేయనున్నట్టు చెప్పారు. వచ్చే నెలలో 10 సేవా కార్యక్రమాలను చేపట్టనున్నామని అధ్యక్షుడు పావులూరి రాంబాబు వెల్లడించారు. మాజీ అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం మాట్లాడుతూ రోటరీ జిల్లా గవర్నర్‌గా రాజ్యలక్ష్మి రోటరీ ఫౌండేషన్‌కు 7.50 లక్షల డాలర్లు, పోలియో ఫండ్‌కు రూ.3.13 వేల డాలర్లు సేకరించి రికార్డు సృష్టించారని చెప్పారు. దాతలు జి.వెంకటరత్నం, జీవీ నారాయణ, డాక్టర్ జీవనలత, డాక్టర్ రవీంద్రనాథ్, పావులూరి రాంబాబు, ఈదర శ్రీనివాసరావు, సుభాని, లోకేష్, సుబ్రమ్మణ్యం, ఈదర పూర్ణచంద్ అందించిన రూ.35 వేలతో పాటు క్లబ్ నిధులు రూ.35 వేలతో కుట్టుమిషన్లను అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com